క్లుప్తంగా

రూపాదేవి సంస్మరణ సభ


నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చొప్పదండి: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి సంస్మరణ సభను శనివారం చొప్పదండిలోని జీఆర్ఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తదితరులు రూపాదేవి చిత్రపటానికి పూలు వేసి ఎమ్మెల్యేను పరామర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్, కౌన్సిలర్లు పెరుమాండ్ల మానస, కొట్టె అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను పరామర్శించిన కేంద్ర మంత్రి


సత్యంను పరామర్శించిన బండి సంజయ్

చొప్పదండి: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి సంస్మరణ కార్యక్రమానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ శనివారం సాయంత్రం హాజరయ్యారు. రూపాదేవి చిత్రపటానికి పూలమాల వేసి మేడిపల్లి సత్యంతోపాటు వారి పిల్లలు, బంధువులను పరామర్శించారు. వెదురుగట్టకు చెందిన బీజేపీ మండల ఉపాధ్యక్షుడు జిల్లాల శంకరయ్య ఇటీవల మృతిచెందగా.. శంకరయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, మావురం సుదర్శన్‌రెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, చేపూరి సత్యనారాయణ, రాజన్నల రాజు, జంగోని తిరుపతిగౌడ్, జక్కుల శంకర్, ప్రభాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి ఎంపీని కలిసిన ముస్లిం ఉద్యోగులు


ఈటల రాజేందర్‌ను సన్మానించిన ముస్లిం ఉద్యోగులు

శంకరపట్నం: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను శనివారం ఆయన నివాసంలో తెలంగాణ ముస్లిం ఉద్యోగుల అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు ఎండీ షఫీయోద్దీన్ సన్మానించారు. చాంద్, సర్దార్, షామోహిల్ తదితరులున్నారు.

కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

జమ్మికుంట: కేరళ రాష్ట్రం వయనాడ్‌లో జరిగిన వరద విపత్తు బాధితులకు శనివారం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టారు. జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. కేరళ రాష్ట్రంలో జరిగిన సంఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు శీలం అశోక్, నాయకులు జక్కుల రమేశ్, చెల్పూరి రాములు, వడ్లూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నేత కార్మికులకు ఉపాధి కల్పించాలి


రమేశ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న రవిశంకర్

రామడుగు: రాష్ట్ర ప్రభుత్వం తక్షణం నేత కార్మికులకు నిరంతర ఉపాధి పనులను కల్పించి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. గోలిరామయ్యపల్లి గ్రామంలో ఇటీవల బలవన్మరణానికి పాల్పడిన నేత కార్మికుడు మిట్టపల్లి రమేశ్ కుటుంబాన్ని, కోరటపల్లిలో మాజీ సర్పంచ్ మన్నె దర్శన్‌రావు తండ్రి మృతిచెందగా వారి కుటుంబాన్ని, తిర్మలాపూర్‌లో బీఆర్ఎస్ నాయకుడు తడగొండ మల్లేశం తల్లి మృతిచెందడంతో వారి కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. మాజీ ఎంపీపీ తవుటు మురళి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్బరీ సాగు.. లాభాలు బాగు

- పట్టు పురుగుల పెంపకంపై రైతుల ఆసక్తి
- హుజూరాబాద్ డివిజన్లో 80 ఎకరాల్లో సాగు


తుమ్మనపల్లిలో మల్బరీ సాగును పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి

హుజూరాబాద్‌రూరల్: వ్యవసాయ అనుబంధ రంగాలతో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. సంప్రదాయ పంటలే కాకుండా ఇతర వాటిపైనా దృష్టి సారిస్తున్నారు. వ్యవసాయ అనుబంధమైన మల్బరీ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. హుజూరాబాద్ డివిజనల్ మల్బరీ సాగు క్రమంగా పెరుగుతోంది. దీనికి తోడు సర్కారు ప్రోత్సాహం అందుతుండటంతో కొత్త రైతులు ఉత్సాహంగా ముందుకొస్తున్నారు. పట్టు పురుగుల పెంపకం ద్వారా ఆశించిన లాభాలు పొందుతున్నారు. స్వల్పకాల వ్యవధిలోనే చేతికి డబ్బు అందుతుండటంతో వీటి సాగుపై మొగ్గు చూపుతున్నారు. ఒకప్పుడు ఎక్కడో కనిపించే మల్బరీ సాగు ప్రస్తుతం గ్రామాల్లోనూ కన్పిస్తోంది. మార్కెట్లోనూ గిట్టుబాటు ధర ఉండటంతో రైతులు ఆశించిన లాభాలు ఆర్జిస్తున్నారు.

పట్టు పరిశ్రమ శాఖ ప్రోత్సాహంతో..

పట్టు పరిశ్రమను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రైతులకు అదనంగా ప్రోత్సాహం అందిస్తున్నారు. మార్కెట్లో 80 పట్టు గూళ్లకు నాణ్యత ఆధారంగా ధర రూ.500 నుంచి రూ.550 వరకు లభిస్తోంది. ప్రభుత్వం ద్వారా అదనంగా కిలో రూ.75 ప్రోత్సాహంగా ఇస్తున్నారు. ఈ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. జిల్లాలోని రైతులు జనగామ, హైదరాబాద్ జిల్లా కేంద్రాలకు పట్టు గూళ్లను తరలించి విక్రయిస్తున్నారు. ఒక్కో రైతు ఏటా సుమారు రూ.2లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు.

రాయితీలతో ప్రోత్సాహం

పట్టు సాగును పెంచేందుకు కేంద్రం రాయితీలను అందిస్తోంది. సిల్క్ సమగ్ర–2 కింద షెడ్డు నిర్మాణానికి ఇతర కులాలవారికి రూ.2.25లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.2,92,500 అందిస్తోంది. రెండెకరాలను ఒక యూనిట్‌గా తీసుకుంటున్న ప్రభుత్వం మల్బరీ తోటలు పెంచేందుకు ఇతరులకు రూ.60వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.78వేలు ఇస్తుంది. బిందు, తుంపర పరికరాలను కూడా రాయితీపై పంపిణీ చేస్తున్నారు. నీటి సదుపాయం కోసం జనరల్ వాళ్లకు రూ.50వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.65వేలు, పట్టు పురుగులను పెంచే పరికరాల కోసం జనరల్ వాళ్లకు రూ.37,500, ఎస్సీ, ఎస్టీలకు రూ.48,750 అందిస్తోంది.

ఆశించిన ఆదాయం

హుజూరాబాద్ డివిజన్‌లో కొంతకాలంగా మల్బరీ సాగు పెరుగుతోంది. డివిజన్లో 38 మంది రైతులు 80 ఎకరాల్లో పట్టు సాగు చేస్తున్నారు. తుమ్మనపల్లి, సింగాపూర్, మాందాడిపల్లి, సైదాపూర్ మండలం ఎలాబోతారం, బొమ్మకల్, అమ్మనగుర్తి, రామచంద్రాపూర్, జమ్మికుంట మండలం నగురం, తనుగుల, ఇల్లందకుంట మండలం మల్లివానిపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఆసక్తితో సాగు చేస్తూ ఆశించిన లాభాలు పొందుతున్నారు.

సాగు పరికరాలకు భారీ రాయితీ



మల్బరీ సాగుపై రైతుల్లో చైతన్యం తీసుకొస్తున్నాం. ఎప్పటికప్పుడు సూచనలు, సాంకేతిక సహకారాన్ని అందిస్తూ ప్రోత్సహిస్తున్నాం. తక్కువ నీటి సౌకర్యమున్న రైతులు మల్బరీ పట్టు పురుగుల పెంపకానికి ముందుకొస్తే ప్రయోజనం. పట్టు పరిశ్రమ శాఖ ద్వారా అనేక విధాలుగా చేయూత అందిస్తున్నాం. తోట పెంపకంతోపాటు షెడ్డు నిర్మాణం, ఇతర పరికరాలకు భారీ రాయితీ అందజేస్తున్నాం. – మహమ్మద్ రషీద్, పట్టు పరిశ్రమ శాఖాధికారి, హుజూరాబాద్

ప్రభుత్వ ప్రోత్సాహం



మల్బరీ తోట సాగు కోసం ఎస్టీ, ఎస్టీ రైతులకు రూ.78వేలు, ఇతరులకు రూ.60వేలు అందజేస్తున్నారు. మల్బరీ పట్టు పురుగుల పెంపకానికి నిర్మించే షెడ్డుకు పట్టు పరిశ్రమ శాఖ చేయూత అందిస్తోంది. షెడ్డు నిర్మాణానికి రూ.4.5లక్షల యూనిట్ ధర కాగా.. ఎస్టీ, ఎస్సీ రైతులకు 65 శాతం, ఇతర రైతులకు 50 శాతం రాయితీ ఇస్తున్నారు. – సురకంటి స్వామిరెడ్డి, రైతు, తుమ్మనపల్లి

30 ఏళ్లకు కలుసుకొని.. స్నేహితులను ఆదుకుంటూ..



చొప్పదండి: వారంతా ఒకే పాఠశాలలో పదేళ్లపాటు కలిసి చదువుకున్నారు. ఉన్నత చదువుల అనంతరం ఎక్కడి వారు అక్కడ స్థిరపడ్డారు. 30 ఏళ్ల అనంతరం రీయూనియన్ పేరిట కలుసుకున్నారు. అప్పటి నుంచి తమతోపాటు చదువుకొని నిరుపేదలుగా మిగిలిన వారి బాధలను పంచుకోవడం మొదలెట్టారు. స్నేహితుల్లో వివాహం చేయడంలో ఇబ్బందులు పడేవారిని, అనారోగ్యంతో బాధపడేవారిని, కుటుంబ పెద్దగా మృతిచెందిన వారికి అండగా ఉంటూ ఆర్థిక సాయం చేస్తూ చిన్ననాటి స్నేహితులు ఆదర్శంగా నిలుస్తున్నారు. చొప్పదండి పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1982 నుంచి 1992 వరకు చదువు పూర్తి చేసిన విద్యార్థులు సమ్మేళనాల పేరిట 30 సంవత్సరాల అనంతరం ఒకేచోట చేరి సమూహంగా ఏర్పడ్డారు. పాఠశాలలో పదేళ్లపాటు చదువుకున్న సుమారు 200 మందికి పైగా విద్యార్థుల డాటాను సేకరించారు. అప్పట్లో ఒకే తరగతిలో ఏ, బీ, సీ అని మూడు గ్రూపులుగా ఉండగా, ఏడాదిపాటు కష్టపడి వారందరిని ఒకేచోట చేర్చి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అదేరోజు రూ.3లక్షల వరకు సేకరించి.. నిరుపేద పూర్వ విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడం మొదలుపెట్టారు.


ఆర్థిక సాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

- అర్నకొండకు చెందిన సునీత అనే పూర్వ విద్యార్థి భర్త చనిపోవడంతో ఆమె అమ్మాయి పెళ్లికి రూ.56వేల ఆర్థిక సాయం అందించారు.
- తొగరిమామిడికుంటకు చెందిన స్వామి అనే పూర్వ విద్యార్థి అనారోగ్యంతో ఉండటంతో రూ.58వేల ఆర్థిక సాయం చేశారు.
- భూపాలపట్నంకు చెందిన అంజయ్య సౌదీ అరేబియాలో మరణించగా.. ఆయన కుటుంబానికి రూ.55వేల ఆర్థిక సాయం చేశారు.
- గ్రూపులో ఏదైనా కుటుంబానికి ఇబ్బంది ఉందని తెలియజేయగానే, గ్రూపు సభ్యులు విరాళాలు అందించి ఆ మొత్తాన్ని బాధిత కుటుంబానికి సాయం చేస్తున్నట్లు సభ్యులు తెలిపారు.

అండగా ఉంటాం



తమతోపాటు చదువుకున్న పూర్వ విద్యార్థులు కష్టాల్లో ఉన్నారని తెలియగానే సభ్యులందరూ స్పందిస్తున్నారు. సుమారు 200 మందికి పైగా పూర్వ విద్యార్థుల సమూహం ఏర్పడింది. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులుగా భావించి స్పందిస్తున్నారు. – పచ్చునూరి తిరుపతి, పూర్వ విద్యార్థి, చొప్పదండి

అందరితో అనుబంధం



పదేళ్లపాటు కలిసి చదువుకున్న విద్యార్థులమంతా 30 ఏళ్ల తర్వాత కలుసుకున్నాం. ఆ సమయంలో కొందరి కుటుంబ పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని తెలియడంతో చేయూత అందించాలని నిర్ణయించాం. పూర్వ విద్యార్థులంతా సాయం చేయడానికి ముందుకొస్తున్నారు. – సాంబారి శ్రీనివాస్, పూర్వ విద్యార్థి, చొప్పదండి

డాక్టరేట్ ప్రదానం

హుజూరాబాద్‌రూరల్: కమల ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల కిట్స్, సింగపూర్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న జాన్సన్‌కు ఓయూ ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరయ్య తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై సంబరాలు


రాంపూర్‌లో హర్షం వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు

హుజూరాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీం కోర్టులో అనుకూలంగా తీర్పు వచ్చిన సందర్భంగా రాంపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మాదిగపల్లె నుంచి మంద కృష్ణ మాదిగ చిత్రపటాన్ని ప్రదర్శిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు, మహిళలు, యువకులు, డప్పు కళాకారులు ర్యాలీగా బయలుదేరి గ్రామ కూడలి దగ్గర నినాదాలతో సంబరాలు చేసుకున్నారు. దళిత నాయకుడు మాడుగుల ఓదెలు మాట్లాడారు. మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మిఠాయిలు పంచి పెట్టారు. గ్రామ మాజీ సర్పంచ్ కాశిరెడ్డి మహేందర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు రామ్ సారయ్య, గౌడ సంఘం నాయకుడు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రుద్రారపు రామచంద్రంమాదిగ, సైదాపూర్ మాజీ ఎంపీపీ పాడిశెట్టి వెంకట్రాజం, ఎలబోతారం మాజీ సర్పంచ్ నమిండ్ల రవీందర్, వేల్పుల రత్నం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం, పచ్చదనంపై సమీక్ష


జమ్మికుంట: మాట్లాడుతున్న ఎంపీడీవో భీమేశ్

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛదనం, పచ్చదనంపై ఎంపీడీవో భీమేశ్ ఆధ్వర్యంలో గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాల వీవోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆగస్టు 5 నుంచి 9 వరకు అన్ని గ్రామాల్లో ఏరోజు ఏ కార్యక్రమం చేయాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ఎంపీవో వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణతోపాటు వన మహోత్సవంలో భాగంగా మొక్కల పెంపకాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు.

రామడుగు: స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి అనిల్ ప్రకాశ్ కోరారు. మండల పరిషత్ సమావేశ హాల్‌లో శనివారం మండల అధికారులతో సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రాజేశ్వరి, ఈవోపీఆర్డీ శ్రావణ్, పశు వైద్యాధికారి అనిల్, డిప్యూటీ తహసీల్దార్ అరుణ్‌కుమార్, పలు శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

దేవాలయాలను పరిశీలించిన టీటీడీ అధికారులు


వెదిరలో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో అధికారులు

రామడుగు: మండలంలోని పలు గ్రామాల దేవాలయాల అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం వారు రూ.10లక్షల చొప్పున నిధులు మంజూరు చేయగా.. వాటి పనుల నిర్వహణ కోసం శనివారం టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు దేవాలయాలను పరిశీలించారు. వెదిర, రామడుగు, రంగసాయిపల్లి గ్రామాల దేవాలయాల్లో భజన భవనాలను నిర్మించడానికి అవసరమైన స్థలాలను సందర్శించి పరిశీలించారు. టీటీడీ దేవాలయం డీఈఈ నాగరాజు, ఏఈ నాగరాజు, మాజీ ఎంపీపీ వంచ సుదర్శన్‌రెడ్డి, నాగుల రాజశేఖర్‌గౌడ్, వెదిర గ్రామ పంచాయతీ కారోబార్ పన్యాల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌డీఏ శిక్షణకు ఎంపిక



చొప్పదండి: గుమ్లాపూర్‌కు చెందిన సైనిక పాఠశాల విద్యార్థి ప్రతిష్టాత్మక నేషనల్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణకు ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన రామడుగు సిద్ధార్థ్ పదోతరగతి వరకు మోడల్ స్కూల్‌లో చదివాడు. ఇంటర్ సైనిక శిక్షణ పాఠశాలలో పూర్తి చేశాడు. తనకు కోచింగ్ ఇచ్చిన సంతోష్ మాస్టర్ సూచనతో ఎన్‌డీఏలో ప్రవేశానికి పరీక్ష రాయగా.. రికమెండ్ చేసినట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా నియామకం కానున్నారు. గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన సిద్ధార్థ్ ఇంటర్‌లో సైనిక శిక్షణ పాఠశాలలో శిక్షణ పొందాడు. గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి అప్పిడి సంతోష్‌రెడ్డి సూచన మేరకు విద్యార్థి సైనిక శిక్షణ పాఠశాలలో చేరాడు. ఇంటర్ అనంతరం ఇంజనీరింగ్ విభాగంలో చేరకుండా ఎన్‌డీఏ పరీక్ష రాసి రికమెండ్ అయ్యాడు. అయిదేళ్లపాటు శిక్షణ అనంతరం ఐపీఎస్ స్థాయి ర్యాంకులో ఎయిర్‌ఫోర్స్ విభాగంలో ఎస్పీస్థాయి అధికారిగా డ్యూటీలో చేరనున్నాడు.

విధుల్లో చేరిన ఎంపీవో

శంకరపట్నం: శంకరపట్నం ఎంపీవోగా ప్రభాకర్ శనివారం విధుల్లో చేరారు. ఇక్కడ పని చేసిన బషీరొద్దీన్ సైదాపూర్ ఎంపీవోగా బదిలీ అయ్యారు. ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఏపీవో శారద, కార్యదర్శి నర్సయ్య తదితరులు సన్మానించారు.

మెహందీ వేడుకలు

గంగాధర: లక్ష్మీదేవిపల్లి గ్రామంలోని నరేంద్ర విద్యాలయంలో శనివారం మెహందీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోరింటాకు ప్రాధాన్యంపై పాఠశాల యాజమాన్యం జి.రాజేశం, గోపాల్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు.

వైద్యశిబిరం

జమ్మికుంట: కేశవపూర్ గ్రామంలో వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 64 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. డాక్టర్ సంధ్యారాణి, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు అరుణ, సదానందం, వైద్య సిబ్బంది సరళ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాల వారోత్సవాలు

తిమ్మాపూర్: రేణికుంటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పల్లె దవాఖాన డాక్టర్ జుబేరియా హాజరై తల్లి పాల ప్రాముఖ్యం వివరించారు. ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాస్, సుజాత, ఏఎన్‌ఎం పద్మ, అంగన్వాడీ టీచర్లు రజిత, స్వరూప, ఆశ కార్యకర్తలు విజయ, అరుణ, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

గన్నేరువరం: బిడ్డకు తల్లి పాలు అమృతం లాంటివని మండల ప్రత్యేకాధికారి రామానుజాచార్య అన్నారు. గన్నేరువరంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లి పాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఎంపీవో శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, కారోబార్ మాధవరావు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మానకొండూర్: పుట్టిన బిడ్డకు తల్లి పాలు శ్రేయస్కరమని అంగన్‌వాడీ టీచర్ రేణుక అన్నారు. ఖాదర్‌గూడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు.


తిమ్మాపూర్: అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జుబేరియా

ఎస్టీ వర్గీకరణ చేయాలి


తిరుపతి శ్రీనివాస్

జమ్మికుంట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణతోపాటు ఎస్టీ వర్గీకరణ అమలు చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి కార్యాచరణ రూపొందించాలని డివిజన్ ఎరుకల సంఘం మాజీ అధ్యక్షుడు తిరుపతి శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలో విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణవ్యాప్తంగా ఎస్టీ తెగలో ఒక ఉప తెగ మాత్రమే ఎక్కువ జనాభా ఉండడంతో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ముందుంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హుజూరాబాద్: హుజూరాబాద్ సబ్ స్టేషన్ పరిధిలోని గణేశ్‌నగర్ ఫీడర్‌లో మామిండ్లవాడ, అన్నపూర్ణ థియేటర్ ఏరియా, జమ్మికుంట రోడ్ ఏరియా, సూపర్‌బజార్ రోడ్, రెడ్డి కాలనీ, కేరళ స్కూల్ ఏరియాలో విద్యుత్ మరమ్మతు దృష్ట్యా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఏఈ శ్రీనివాస్‌గౌడ్ శనివారం తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

విరాసత్ రద్దు చేయాలని ఫిర్యాదు

శంకరపట్నం: తప్పుడు పత్రాలతో చేసిన విరాసత్‌ను రద్దు చేయాలని శంకరపట్నం డిప్యూటీ తహసీల్దార్ రమేశ్‌కు మొలంగూర్ గ్రామానికి చెందిన 90 ఏళ్ల పొద్దుటూరి శంకరమ్మతోపాటు కూతుళ్లు, బంధువులు శనివారం ఫిర్యాదు చేశారు.

రోడ్డుకు మరమ్మతు



గంగాధర: గర్శకుర్తి గ్రామంలోని నాగమయ దేవాలయం వెళ్లే రహదారిని స్థానిక లయన్స్ క్లబ్ సభ్యులు మరమ్మతు చేయించారు. ట్రాక్టర్ల ద్వారా మట్టి పోయించి మరమ్మతు చేశారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ


సాధించిన పతకాలతో విద్యార్థులు

చిగురుమామిడి: మండల కేంద్రంలో టాటా బిల్డింగ్ ఇండియా వారు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో డార్విన్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. శనివారం స్మార్ట్ ఇండియా నిర్మాణంలో యువత పాత్ర అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సీనియర్, జూనియర్ విభాగాల్లో విద్యార్థులు రాణించారు. సీనియర్ విభాగంలో అక్షయ్ కుమార్ బంగారు, శుశాంత్ వెండి, శ్రీవర్ష కాంస్య పతకాలు సాధించారు. జూనియర్ విభాగంలో శశాంక్ బంగారు, ఆర్యకు వెండి, రిశిక్ కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల హెడ్ మాస్టర్ సమ్మిరెడ్డి తెలిపారు.

వంతెన నిర్మించాలని వినతి


కేంద్ర మంత్రికి వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాస్

శంకరపట్నం: అర్కండ్ల వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ శనివారం వినతిపత్రం అందించారు. కేశవపట్నం నుంచి వీణవంక మండలం చల్లూర్ వరకు కేంద్రం నిధులతో రోడ్డు నిర్మించారని, అర్కండ్ల వాగుపై 10 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో లోలెవల్ బ్రిడ్జి నిర్మించారన్నారు. వాగు ప్రవహిస్తున్నప్పుడు ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని, బ్రిడ్జికి నిధులు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, నిధులు మంజూరు చేసి బ్రిడ్జి నిర్మించాలని కోరారు.

ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రవీందర్‌రావు

రామడుగు: ప్రతి విద్యార్థి కష్టపడి చదివినప్పుడే తాను ఆశించిన లక్ష్యం సాధించే అవకాశం ఉంటుందని కిమ్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పేర్యాల రవీందర్‌రావు అన్నారు. వెదిర గ్రామ కిమ్స్ లా కళాశాలలో శనివారం లా విద్యార్థులతో ఎక్స్‌ట్రా గవాంజా కార్యక్రమం నిర్వహించారు. వైస్ చైర్మన్ సాకేత్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. లా కళాశాల అధ్యాపకులు వెంకటస్వామి, కిషన్, కొంరయ్య, వంశీకృష్ణ, కీర్తి, రవీంద్రాచారి పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న సేవాసమితి సభ్యులు

చొప్పదండి: రాగంపేటలో వృద్ధులకు పరంజ్యోతి సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. పరంజ్యోతి భగవతీ పద్మావతి అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకొని పక్షం రోజులపాటు సేవా కార్యక్రమాలను చేస్తున్నట్లు సభ్యులు తెలిపారు. నందికొండ మల్లారెడ్డి, ఇటిక్యాల శ్రీనివాస్, కళ్లెం రవీందర్‌రెడ్డి, సిరవేని మల్లేశం, చంద్రకళ, శ్రీశైలం, తార, విజయ, జలజ, వకుళాదేవి, కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు పాసుల అందజేత


బస్సు పాసులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 30 మంది విద్యార్థులకు తలపాక లావణ్య, షరాఫ్ ఆర్థిక సాయంతో ఆర్టీసీ డిపో మేనేజర్ రవీంద్రనాథ్, పాఠశాల హెచ్‌ఎం శోభారాణి చేతుల మీదుగా శనివారం బస్సు పాసులను అందజేశారు. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి వేల్పుల ప్రభాకర్, సీఆర్పీ అమరేందర్, ఉపాధ్యాయులు ఈశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.